క్లుప్తంగా

సింహగిరిపై సెల్‌ఫోన్ కౌంటర్‌లో అక్రమ వసూళ్లు

- ఏఈవో ఆకస్మిక తనిఖీల్లో బయటపడిన వైనం

సింహాచలం: సింహగిరిపై భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరిచే కౌంటర్‌లో దేవస్థానం అవుట్ సోర్సింగ్ సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వైనం శనివారం ఆకస్మికంగా దేవస్థానం ఏఈవో చేసిన తనిఖీల్లో బయటపడింది. వివరాలిలోకి వెళ్తే.. భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరిచే కాంట్రాక్టును చేయలేక కాంట్రాక్టర్ ఇటీవల విరమించుకున్నాడు. దాంతో దేవస్థానమే స్వయంగా తమ సిబ్బందిని కౌంటర్లలో నియమించి సెల్‌ఫోన్ భద్రపరిచే ఏర్పాటు చేసింది. కౌంటర్లలో ఒక్కో సెల్‌ఫోన్‌కి రూ.5 చొప్పున వసూలు చేయాల్సి ఉంది. ఈ తరుణంలోనే రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అధిక వసూళ్లకు పాల్పడుతున్నారన్న విషయం ఇటీవల చర్చాంశనీయమైంది. దీంతో శనివారం దేవస్థానం ఏఈవో పాలూరి నరసింగరావు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జారీ చేసిన టికెట్లు కంటే రూ.960 నగదు మహిళా అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వద్ద అధికంగా ఉన్నట్టు గుర్తించారు. దీంతో రిపోర్టు తయారుచేసి దేవస్థానం ఈవో దృష్టికి తీసుకెళ్లారు.

స్టార్టప్ స్కిల్స్‌పై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్-స్టార్టప్ స్కిల్స్‌పై రిసోర్స్ పర్సన్ వసంత పట్నాయక్ అవగాహన కల్పించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్‌మెంట్, హిందుస్తాన్ యూనీలివర్ లిమిటెడ్ వారి సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, కామర్స్ హెచ్‌వోడీ ఎం.గోవిందరావు, తెలుగు లెక్చరర్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, కామర్స్ అధ్యాపకురాలు బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దు



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న దేముడమ్మ

సబ్బవరం: మండలంలోని సబ్బవరం, గొర్లివానిపాలెం గ్రామాల్లో కోళ్ల ఫారం షెడ్లు నిర్మించడానికి ఎవరికీ, ఏవిధమైన అనుమతులు ఇవ్వకుండా నిలుపాలని మేజర్ పంచాయతీలో పలువురు వార్డు మెంబర్లు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆయా వార్డు మెంబర్లు శనివారం పంచాయతీ కార్యదర్శి మూర్తికి వినతిపత్రం అందజేశారు. సబ్బవరం మండల కేంద్రం కావడంతో ఎప్పుడూ జనావాసాలతో నిండి ఉంటుందన్నారు. సబ్బవరంలో కోళ్ల ఫారాలు ఏర్పాటు చేయడం వల్ల వాతావరణం కలుషితమై అంటువ్యాధులు ప్రబలి, ప్రజలు రోగుల గురవుతున్నారని, ఎవరికీ అనుమతులు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. వార్డు మెంబర్లు కె.దేముడమ్మ, టి.శేఖర్, ఎస్.శివ తదితరులు వినతిపత్రం అందించారు.

చిన్నోడి పెద్ద మనసు



పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందజేస్తున్న రోహన్ చెర్ల

దాబాగార్డెన్స్: పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించేందుకు 17 ఏళ్ల రోహన్ చెర్ల ముందుకొచ్చాడు. రోహన్ తాత వారణాసి సూర్యనారాయణమూర్తి ఏవీఎస్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకుడిగా పనిచేశారు. ఆయన జ్ఞాపకార్థం శనివారం కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాగా చదువుతున్న పేద విద్యార్థులకు రూ.6 లక్షలు ఆర్థిక సాయం అందించాడు. పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందిస్తూ, వారి చదువుకు ప్రోత్సాహం అందివ్వడమే ధ్యేయమని రోహన్ తెలిపాడు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ తాను చదువుకుంటూ పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. సుమారు 50 మంది విద్యార్థులకు రూ.6 లక్షలు అందజేయడం గొప్ప విషయమన్నారు.

భద్రత చాలా ముఖ్యం



ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వర్తించే వైద్యులకు తప్పనిసరిగా భద్రత కల్పించాలి. సీసీ కెమెరాలు అవసరం. ముఖ్యంగా రాత్రి వేళల్లో పనిచేసే మహిళా వైద్యులు, స్టాఫ్ నర్సులకు వంద శాతం సెక్యూరిటీ ఉండాలి. అడవివరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ఉన్న ప్రాంగణంలోని వసతి భవనంలో రాత్రి వేళల్లో 10 నుంచి 15 మంది హౌస్‌సర్జన్లు ఉంటారు. వీరిలో సగం వరకు మహిళలే. వీరి కోసం ఆస్పత్రి భవనంలోనే ఉన్న ఒక గదిని కేటాయించాం.

– డాక్టర్ నాయక్, డిప్యూటీ సివిల్ సర్జన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అడవివరం



నైట్ వాచ్‌మన్‌ను నియమించాలి



వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నైట్ వాచ్‌మన్‌ను నియమించని కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పీహెచ్‌సీలో నైట్ డ్యూటీ చేస్తున్న వైద్య సిబ్బందికి కనీస రక్షణ లేకుండా పోయింది. రాత్రి సమయంలో కొంతమంది మద్యం తాగి వైద్యానికి వస్తున్నారు. అలాంటప్పుడు చాలా భయపడుతున్నాం. వేళాపాళా లేకుండా తలుపులు కొడుతున్న సమయంలో మహిళా వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. 24 గంటలు పనిచేస్తున్న పీహెచ్‌సీకి నైట్ వాచ్‌మన్ ఎంతైనా అవసరం.

– కె.ధనలక్ష్మి, హెల్త్ వర్కర్

ఉద్యాన పంటల వైపు అన్నదాతల చూపు

- అనుకూలించని వర్షాలు.. తగ్గుతున్న వరిసాగు
- జోరుగా ప్రత్యామ్నాయ పంటల సాగు
- మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 3,300 ఎకరాలు
- ఇప్పటివరకు నాట్లు వేసింది 491 ఎకరాల్లోనే..

మండలంలో ఏటా తగ్గుతున్న వరిసాగు సాధారణ విస్తీర్ణం(ఎకరాలు)

2019	-	4,000
2020	-	3,775
2021	-	3,700
2022	-	3,550
2023	-	3,375
2024	-	3,300



ట్రాక్టర్‌తో దమ్ము పడుతున్న రైతు



అమృతాపురంలో రైతులచే నాట్లు వేయిస్తున్న వ్యవసాయ సిబ్బంది



నారపాడులో సమతుల్య ఎరువుల వినియోగంపై రైతుకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌బీకే వ్యవసాయ సహాయకుడు హరీష్

సబ్బవరం: వ్యవసాయ భూములు నానాటికీ తగ్గిపోతున్నాయి. పెరుగుతున్న జనాభాకు సరిపడా ఆహార ధాన్యాలు, అధిక దిగుబడులను సాధించే దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. సాగు భూములు తగ్గిపోవడంతో ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఉన్న భూముల్లోనే మేలైన యాజమాన్య పద్ధతులు, మెలకువలను సాధించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. దీనిలో భాగంగా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, నారుమడుల్లో యాజమాన్య పద్ధతులు పాటించడం, సమతుల్య ఎరువులను వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించడం, సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు పాటించేలా ప్రోత్సహించడం, యాంత్రీకరణ విధానాలు అవలంబించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుని అధిక దిగుబడులు సాధించడం జరుగుతోంది.

ప్రత్యామ్నాయ పంటలు

సబ్బవరం మండలంలో నానాటికీ వరిసాగు విస్తీర్ణం తగ్గుతోంది. ఈ ఏడాది 3,300 ఎకరాల్లో వరిసాగు చేయాల్సి ఉండగా.. కేవలం 491 ఎకరాల్లో వరినాట్లు వేశారు. ఈ ప్రాంతం పూర్తిగా వర్షాధార సాగు కావడంతో ఒక్కోసారి వర్షాభావ పరిస్థితులు నెలకొని పంట చేతికి రాక రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. దీంతో ఉన్న భూముల్లోనే ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలతోపాటు సరుగుడు, యూకలిప్టస్ మొక్కలు వేసుకుంటున్నారు. మరో పక్క ఈ ప్రాంతం సెమీ అర్బన్ కావడం, విశాఖకు అత్యంత సమీపంలో ఉండటంతో నిర్మాణ రంగం ఊపందుకుని ఉన్న కొద్దిపాటి భూములను లేఅవుట్లుగా మార్చేస్తున్నారు.

సేంద్రియ సాగు దిశగా..

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఉత్పత్తులను సాధించవచ్చు. దీని కోసం సేంద్రియ ఎరువులతోపాటు పచ్చిరొట్ట ఎరువులను ఎక్కువగా వినియోగించాలి. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువులను వినియోగించుకోవాలి.

వ్యవసాయ యాంత్రీకరణ

కూలీల ఖర్చులు, వ్యవసాయ పెట్టుబడులను తగ్గించుకునేందుకు వ్యవసాయ యాంత్రీకరణ ఒక్కటే మార్గం. రైతులకు వ్యక్తిగత పరికరాలను సమకూర్చినప్పుడే అది సాధ్యమవుతుంది. రాయితీపై యంత్రాలను సమకూర్చే దిశగా ప్రభుత్వం కృషి చేయాలి.

సరుగుడు సాగు చేస్తున్నా..



నాకు అమృతాపురంలో 3 ఎకరాల భూమి ఉంది. దానిలో రెండు ఎకరాల వరకూ వరిసాగు చేసేవాడిని. మిగిలిన భూమిలో ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలు వేసుకునేవాడిని. వరిసాగుకు సకాలంలో కూలీలు దొరక్క, పని చేసుకోలేక నష్టాలు రావడంతో పూర్తిగా తగ్గించేశాను. ప్రస్తుతం 25 సెంట్లలో వరి వేసుకుని మిగిలిన భూమిలో దీర్ఘకాలిక పంట సరుగుడు వేసుకున్నాను.

– చీపురుబల్లి సూర్యనారాయణ, అమృతాపురం

ఉద్యాన పంటలు వేశాం



మాకు గ్రామంలో 1.5 ఎకరాల భూమి ఉంది. మరొకరది ఎకరా కౌలు తీసుకున్నాం. దీనిలో రెండు ఎకరాల వరకూ వరిసాగు చేస్తూ మిగిలిన 50 సెంట్లలో ఉద్యాన పంటలు వంగ, టమాటా వంటివి సాగుచేస్తున్నాం. వరిసాగు పూర్తిగా వర్షాధారం కావడంతో పొలాల వద్ద ఉన్న బావులను ఆధారం చేసుకున్నాం. నీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తినపుడు పంటలు ఎండిపోవడంతో నష్టాల బారిన పడుతున్నాం. వరిసాగులో సకాలంలో కూలీలు దొరక్క, పెట్టుబడులు అధికం కావడంతో కూడా తీవ్రంగా నష్టపోతున్నాం.

– పిల్లల స్వామినాయుడు, రాయపుర అగ్రహారం

ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలు



సబ్బవరం మండలంలో వరిసాగు పూర్తిగా వర్షాధారంగా చేస్తున్నారు. మండలంలో నానాటికీ వరిసాగు చేసే విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. సబ్బవరం విశాఖకు అత్యంత సమీపంలో ఉండటంతో వరికి ప్రత్యామ్నాయంగా కొంత ఉద్యాన పంటలు సాగుచేస్తూ రైతులు లాభసాటిగా మార్చుకుంటున్నారు. వరిసాగులో పెట్టుబడులు అధికం కావడం, కూలీలు దొరక్కపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటూ నష్టాలను చవిచూస్తున్నారు. మరికొంత భూముల్లో సరుగుడు, యూకలిప్టస్ వంటి దీర్ఘకాలిక పంటలు వేసుకుని రైతులు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూసుకుంటున్నారు.

– పోతల సత్యనారాయణ, వ్యవసాయ అధికారి, సబ్బవరం మండలం

ఉపాధి కల్పనలో స్థానిక యువతకు ప్రాధాన్యం



సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హాతో చర్చిస్తున్న అనకాపల్లి ఎంపీ రమేష్, ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ, హిందూజా పవర్ ప్లాంట్లలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ఇరు ప్లాంట్ల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సూచించారు. సింహాద్రి ఎన్టీపీసీ, హిందూజా విద్యుత్ ప్రాజెక్టులను శనివారం ఎంపీ రమేష్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సందర్శించారు. సింహాద్రి ఎన్టీపీసీ ఉత్పత్తి చేస్తున్న ఫ్లైయాష్ వల్ల ప్రజలకు ఎటువంటి వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ, హిందూజా పరిశ్రమల్లో ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని యాజమాన్యాలను ఎంపీ ఆదేశించారు. పరవాడ మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీలు మాధంశెట్టి నీలబాబు, మాసవరపు అప్పలనాయుడు, రావాడ, ఇ.బోనంగి, పరవాడ సర్పంచులు మోటూరి సన్యాసినాయుడు, బొద్దపు శ్రీనివాసరావు, సిరపరపు అప్పలనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని వినతి

సింహాద్రి ఎన్టీపీసీ వ్యర్థ జలాల కారణంగా తీవ్రంగా నష్టపోతున్న ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఆ సంస్థలో ఉపాధి కల్పించాలని మత్స్యకార నాయకుడు చింతకాయల ముత్యాలు కోరారు. అనకాపల్లి ఎంపీ రమేష్, ఎమ్మెల్యే పంచకర్ల చేతుల మీదుగా ప్రాజెక్టు హెడ్ సిన్హాకు వినతిపత్రం అందజేశారు. మత్స్యకారుల ఇబ్బందులను గుర్తించి వారికి సంస్థలో ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిన్హాకు ఎంపీ సూచించారు. ఎంటీటీసీ అరిజిల్లి దేవిరవి, మత్స్యకార నాయకులు చేపల మసేను, సిహెచ్.అమ్మోరు, మైలపల్లి అప్పన్న, సూరాడ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రక్షణ కల్పించాలి



లంకెలపాలెం వంతెన వద్ద రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: ఫార్మాసిటీ, ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం కోరారు. లంకెలపాలెం వంతెన సమీపంలో సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎసెన్షియా, సినర్జిన్ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 18 మంది ప్రాణాలను బలిగొన్న ఎసెన్షియా యాజమాన్యాన్ని అరెస్టు చేయకపోవడం ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమన్నారు. యాజమాన్యాలకు రాయితీలు కల్పిస్తూ కార్మిక చట్టాలు అమలు చేయని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వరుస ప్రమాదాలపై తనిఖీలు లేకపోవడం వల్ల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికులు విధులకు రావాలంటేనే భయపడుతున్నారన్నారు. ఫార్మాసిటీ, ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నప్పటికి స్థానికంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని వాపోయారు. పరవాడలో రెండు వందల పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు వెంకటరావు, లక్ష్మణరావు, సంతోష్, రమేష్, నాగరాజు, దేవకిశోర్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు





వేంకటేశ్వర స్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలబోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వేంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. చాతుర్మాస దీక్షలో భాగంగా శ్రీరామాయణ హవనం నిర్వహించారు. అనంతరం శ్రీనివాసకల్యాణం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. ప్రసాదం, మజ్జిగ వితరణ చేపట్టారు.

శారదా పీఠంలో కృష్ణాష్టమి వేడుకలు రేపు



పెందుర్తి: చినముషిడివాడలోని శారదా పీఠంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు పీఠం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి శ్రీకృష్ణుడికి అభిషేకాలు, పూజలు, గోపూజ, సాయంత్రం ఉట్టి సంబరాలు జరుగుతాయన్నారు. 12 ఏళ్లలోపు బాలబాలికలు చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలు అలరిస్తారని..భక్తులంతా ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

ఉత్సాహంగా యూత్ పార్లమెంట్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కేంద్రీయ విద్యాలయం ఉపాధ్యాయులు

సింధియా: మల్కాపురంలోని కేంద్రీయ విద్యాలయంలో 35వ రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలు రెండో రోజూ ఉత్సాహంగా కొనసాగాయి. హైదరాబాద్ రీజినల్ ఆఫీస్ నుంచి అసిస్టెంట్ కమిషనర్ రెజి.వి.ఆర్.విశ్వనాథ్ ప్రత్యేక న్యాయమూర్తిగా వ్యవహరించిన పోటీల్లో నెల్లూరు కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు, జేవీ పికెట్ హైదరాబాద్, కేవీ ఎన్ఏపీ హైదరాబాద్, కేవీ బొల్లారం హైదరాబాద్, కేవీ – 2 శివాజీనగర్ విశాఖపట్నం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, ప్రజలకు సేవలందించాలని కోరారు. ఈ పోటీల్లో కేవీ – 2 శివాజీనగర్ విశాఖపట్నం, కేవీ నెల్లూరు, కేవీ పికెట్ హైదరాబాద్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు



గోపీజన వల్లభస్వామి

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు లక్ష్మీనరసింహనగర్‌లోని గోపీజన వల్లభస్వామి ఆలయంలో ఈ నెల 25, 26 తేదీల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారి శోభాయాత్ర జరుగుతుందని చెప్పారు. కృష్ణాష్టమి రోజున సోమవారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు స్వామికి గోక్షీరాభిషేకం, ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సహస్ర నామార్చన, విష్ణు సహస్రనామ పారాయణం, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4.30 గంటలకు స్వామికి 108 రకాల ప్రసాదం నివేదన, 5 గంటల నుంచి ఊంజల్ సేవ, 5.30 గంటల నుంచి ఐదేళ్ల బాలబాలికలకు బాలకృష్ణ వేషధారణ పోటీలు జరుగుతాయని చెప్పారు. సాయంత్రం 6.30 గంటల నుంచి శ్రీ సరస్వతి నృత్య మందిర్‌చే భరతనాట్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు. 26వ తేదీ సాయంత్రం 4.30 గంటల నుంచి జరిగే 108 రకాల ప్రసాద నివేదనలో భక్తులు పాలుపంచుకోవచ్చని, ఎవరైనా తమ ఇంటి వద్ద తయారుచేసిన ప్రసాదాన్ని తీసుకురావచ్చని తెలిపారు. భక్తులంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి సందడి



రవీంద్రభారతి పాఠశాలలో ఉట్టి సంబరాల్లో చిన్నారులు



భాష్యం స్కూల్‌లో రాధాకృష్ణుల వేషధారణల్లో అలరిస్తున్న విద్యార్థులు

పెందుర్తి: పట్టణంలోని పలు పాఠశాలల్లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. సుజాతనగర్‌లోని రవీంద్రభారతి స్కూల్‌లో విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలు, నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఉత్సాహంగా ఉట్టి కొట్టారు. పాఠశాల జోనల్ ఇన్‌చార్జి ఎస్.వెంకటేశ్, సీజీఎం జి.ఆర్.వసంత, జీఎం కె.రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప చంద్రకళ, అకడమిక్ ఇన్‌చార్జి సాయిబిందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- భాష్యం స్కూల్‌లో విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలతో అలరించారు. నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉట్టి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ప్రిన్సిపాల్ జి.వి.దీపిక, హెచ్ఎం ఎం.టెస్సీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

14న మెగా లోక్ అదాలత్

గాజువాక: సుప్రీం కోర్టు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు వచ్చేనెల 14న గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు 13వ అదనపు జిల్లా జడ్జి జె.షణ్ముఖరావు తెలిపారు. గాజువాక అదనపు జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అదాలత్లో అన్ని రకాల బ్యాంకు కేసులు, భూతగాదా కేసులు, రెవెన్యూ, కార్మిక, కుటుంబ తగాదాలు, మోటారు ప్రమాదాల్లో పరిహారానికి సంబంధించిన కేసులు, ఇన్సూరెన్స్, విద్యుత్, నీరు, టెలిఫోన్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు న్యాయవాదులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, పి.ప్రదీప, పోలీసు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా కంచర్ల



కంచర్ల అచ్యుతరావును సత్కరిస్తున్న ఫెడరేషన్ సభ్యులు

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ చైర్మన్‌గా డాక్టర్ కంచర్ల అచ్యుతరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపకార్ ట్రస్ట్ అధ్యక్షునిగా, సినీ నిర్మాతగా, విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘ అధ్యక్షునిగా కంచర్ల సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల సినీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఏ ప్రాంతంలో షూటింగ్ జరిగితే ఆ ప్రాంత కార్మికులకు అవకాశం కల్పించడానికి, వారి జీవనోపాధికి బాటలు వేస్తానన్నారు. అనంతరం ఆయనను కళాకారులు, పరిశ్రమలో పనిచేస్తున్న వారు ఘనంగా సత్కరించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు కొండపల్లి అప్పారావు, ప్రధాన కార్యదర్శి చవల మురళీకృష్ణ పాల్గొన్నారు.